

గంగమ్మకు హారతి



గంగమ్మ సన్నిధిలో భక్తజన సందోహం

విరాడ్రూపం.. విశ్వజన సమ్మోహం!

● వైభవంగా గంగమ్మ విశ్వరూప దర్శనం

కుప్పం, మే 21 (ఆంధ్రజ్యోతి): కళ్లెరుపుజేసి జూస్తే ఎదుట నిలువలేరు. త్రిశూలం ఎక్కుపెట్టి నిలిస్తే.. ఎదుట ఉండలేరు. ఆయమ్మ విరాడ్రూపం భయంకరం. అయినా విశ్వజన సమ్మోహనం. కారణం.. రూపంమాత్రమే ఉగ్రం.. మనసంతా కరుణాతరంగం. శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ కుప్పం ఆడబిడ్డ. ఏడాదికోమారు సంపూర్ణ రూపంతో దర్శనమిచ్చి భక్తజనంపై చల్లని ఆశీర్వాదాలు కురిసే భక్తజనవశంకరి ఆమె. గంగమ్మ జాతర మహోత్సవాల చివరి ఘట్టమైన అమ్మవారి విశ్వరూప దర్శనం బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయంనుంచి రాత్రిదాకా కుప్పం పట్టణం వీధివీధిలో ఊరేగుతూ జనాల నుంచి బలులు, హారతులు స్వీకరించిన గంగమ్మ శిరస్సు రాత్రి బాగా పొద్దుపోయాక ఆలయం చేరింది. వెంటనే విశేష పూజలు చేసిన పూజారులు ఆలయంలో అప్పటికే ఉన్న శేష శరీర భాగంపై ఆ శిరస్సును అమర్చారు. అంతే.. శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ సంపూర్ణ రూపం ఆవిష్కృతమైంది. ఉదయం అమ్మవారికి వేసిన తెర తొలగించి విశేష పూజలు నిర్వహించి, భక్తులను దర్శనానికి అనుమతిచ్చారు. అందుకోసమే వేచివున్న లక్షలాదిమంది భక్తులు ఒక్కుమ్మడిగా అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. శిరస్సుపై కలశాలు ధరించిన ఆడవాళ్లు.. విచిత్ర వేషాలు కట్టినవారు.. కర్పూర హారతుల పళ్లేలు చేతబట్టినవారు.. వేపమండలతో శివాలెత్తినట్లు ఊగే వారు.. భుజాలపై చిన్నారులతో ఉన్న తండ్రులు.. చంకలో బిడ్డల్ని ఓదారుస్తున్న తల్లులు.. కాటికి కాళ్లు చాపుకున్న ముసలులు.. ఒకరేమిటి.. సర్వజనులూ అమ్మవారి విశ్వరూ దర్శన భాగ్యం కోసం క్యూలైన్లలో గంటలతరబడి వేచి మరీ ఆమె చెంతకు చేరి మొక్కులు తీర్చుకుని చల్లని ఆశీర్వాదాలు పొందారు. జంతు బలులు, పొంగళ్లు బుధవారంనాడు కూడా భక్తులు యథేచ్ఛగా కొనసాగించారు. ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదు.. పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుంచి కూడా భక్తులు అమ్మవారి దర్శనంకోసం పోటెత్తారు. అధికారులు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మవారి విశ్వరూప దర్శన ఘట్టం ప్రశాంత వాతావరణంలో భక్తిప్రపత్తుల మధ్య ముగిసింది.



ముత్తుమారెమ్మ శిరస్సు వద్ద విదేశీయుల సందడి

గంగమ్మ జలావాసం

అమ్మవారి విశ్వరూప దర్శనం ఉదయంనుంచి రాత్రి 11.30 గంటలదాకా ఏకధాటిగా సాగింది. మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకుని టీటీడీనుంచి తీసుకువచ్చిన పట్టువస్త్రాలను అమ్మకు సమర్పించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు గంట సమయం సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనాన్ని నిలిపివేసి వీఐపీలకు అవకాశం కల్పించారు. అయినా తొక్కిసలాటలు జరక్కుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. అనంతరం రాత్రి సుమారు 11.30 గంటలదాకా సాధారణ భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం గంగమ్మ శేష భాగాన్నుంచి ఆమె శిరస్సును తొలగించి గంగబావి వద్దకు పూజారులు ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. ఇక్కడ గంగమ్మ కళ్లను తొలగించి శాస్త్రోక్తంగా జలావాసం చేయించారు. దీంతో కుప్పం గంగ జాతర ఘట్ట ం పరిసమాప్తమైంది.

చల్లంగ చూడవే మముగన్న తల్లీ!

● గంగమ్మకు సీఎం చంద్రబాబు దంపతుల పూజలు

కుప్పం, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా, అభివృద్ధి పథంలో నడవాలని, ప్రజలను చల్లగా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు గంగమ్మ తల్లిని కోరుకున్నారు. కుప్పంలో వెలసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాల చివరి ఘట్టమైన గంగమ్మ విశ్వరూప దర్శనం బుధవారం వైభవంగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సతీసమేతంగా బుధవారం మధ్యాహ్నం అమ్మవారిని దర్శించుకున్నారు. టీటీడీ తెచ్చిన పట్టు వస్త్రాలను, పసుపుకుంకుమ సారెను ప్రభుత్వం తరఫున అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తర్వాత తిరిగి వెళుతూ ఆలయం ఎదుట క్యూలో ఉన్న భక్తులను నవ్వుతూ పలకరించారు. ద్రావిడ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద కూడా పలువురు టీడీపీ ప్రముఖులను, కార్యకర్తలను పలుకరించి కరచాలనం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు జిల్లా అధికారయంత్రాంగంతోపాటు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు, బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం, జాతర ఉత్సవ కమిటీ ప్రథమ సభ్యుడు బీఎంకే.రవిచంద్రబాబు, ఇతర సభ్యులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తదితరులు సాదర స్వాగతం పలికారు. కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కుప్పం మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ సుధీర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, టీడీపీ రాష్ట్ర నాయకులు పి.గోపీనాథ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.కాగా ముఖ్యమంత్రి హోదాలో శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబను దర్శించుకోవడం చంద్రబాబు దంపతులకు ఇది రెండోసారి. 2019వ సంవత్సరంలో ఎన్నికలకు ముందు జాతర సందర్భంగా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు గంగమ్మను దర్శించుకుని ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించుకున్నారు. మళ్లీ ఇన్నాళ్లకు ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలోనే ఆయన గంగమ్మ దర్శనం చేసుకున్నారు. ముఖ్యమంత్రిగా బిజీగా షెడ్యూల్ ఉన్నాసరే, స్థానిక టీడీపీ నాయకుల కోరిక మన్నించి చంద్రబాబు కుప్పం వచ్చి అమ్మవారిని దర్శించుకుని మళ్లీ అప్పటికప్పుడే తిరుగు ప్రయాణమయ్యారు.



గంగమాంబకు సారె సమర్పిస్తున్న చంద్రబాబు

టీచర్ల బదిలీ ప్రక్రియ మొదలైంది

చిత్తూరు సెంట్రల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ బుధవారం మొదలైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. గ్రేడ్-2 హెచ్ఎం/ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ యాజమాన్యాల్లోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టినట్లు ఆమె తెలిపారు. 2025 మే 31 నాటికి 5/8యేళ్ల సర్వీసు ఒకేచోట పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు, హేతుబద్ధీకరణలో పోస్టు బదలాయింపునకు గురైన ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరి అని తెలిపారు. ఒకే స్టేషన్‌లో కనీసం 2 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు, హెచ్ఎంలు అభ్యర్థన బదిలీలకు అర్హులని ఆమె తెలిపారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ఇలా...

కార్యాచరణ	హెచ్ఎం	ఎస్ఏ	ఎస్జీటీ
బదిలీకి దరఖాస్తు	21,22.05.2025	21-24.5.2025	21-27.5.2025
పరిశీలన	21,22.05.2025	21-25.5.2025	21-28.5.2025
సీనియారిటీ	24.5.2025	26,27.5.2025	21.5.2025
అభ్యంతరాల స్వీకరణ	25.5.2025	28.5.2025	28.5.2025-1.6.2025
అభ్యంతరాల పరిశీలన	26.5.2025	28,29.5.2025	28.5.2025-2.6.2025
తుది సీనియారిటీ జాబితా	27.5.2025	31.5.2025	6.6.2025
వెబ్ ఆప్షన్	28.5.2025	1.6.2025-2.6.2025	7.6.2025-10.6.2025
బదిలీ ఉత్తర్వులు	30.5.2025	4.6.2025	11.6.2025
పదోన్నతులు	-	30.5.2025(ఎస్ఏ-హెచ్ఎం)	5.6.205(ఎస్జీటీ-ఎస్ఏ)
పదోన్నతి ఉత్తర్వులు	-	31.5.2025	6.6.2025

పారదర్శకంగా జేఎల్స్ బదిలీలు : ఆర్జేడీ

చిత్తూరు సెంట్రల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ విద్యలో అధ్యాపకుల బదిలీలు పారదర్శకంగా చేపట్టనున్నట్లు చిత్తూరు డీఐఈవో, కడప ఆర్జేడీ శ్రీనివాసులు వెల్లడించారు.బుధవారం డీఐఈవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ రీజియన్ పరిధిలో 68 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయని చెప్పారు.ఇందులో 400 మంది టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, 68మంది ప్రిన్సిపాళ్లు ఉన్నారని తెలిపారు. బదిలీలకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలు రాగానే బదిలీ ప్రక్రియ చేపట్టి నెలాఖరులోపు పూర్తి చేస్తామని చెప్పారు. ఏప్రిల్ 7 నుంచి జూన్ ఒకటి వరకు జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు మొదటి దశ అడ్మిషన్ల ప్రక్రియవుంటుందని, జూన్ రెండవ తేదీ నుంచి రెండో దశ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ యాజమాన్య కళాశాలల విద్యార్థులకు సెకండియర్‌కు సంబంధించి స్టడీ మెటీరియల్ పోటీ పరీక్షలకు సంబంధించిన తెలుగు బుక్‌లెట్స్ వచ్చాయన్నారు. జూన్ 2న కళాశాలలు ప్రారంభం కాగానే సెకండియర్ విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. కాగా ఫస్టియర్, సెకండియర్‌కు సంబంధించి టెక్ట్స్‌బుక్స్ రావాల్సి ఉందని చెప్పారు. ఇప్పటికే ఇంటర్మీడియట్ అడ్వాన్డ్ సప్లిమెంటరీ పరీక్షలు ముగిసిన క్రమంలో ఈనెల 19 నుంచి తిరుపతిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతుందని చెప్పారు.



ఆర్జేడీ శ్రీనివాసులు

రేషన్‌కార్డు అర్హులకు హౌస్‌హోల్డ్ చిక్కులు

● వైసీపీ హయాంలో ఇష్టానుసారంగా సర్వే

● దాన్నే ప్రామాణికంగా తీసుకున్న సాఫ్ట్‌వేర్

చిత్తూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): చాలా ఏళ్ల తర్వాత కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు, పాత కార్డుల్లో మార్పు చేర్పులకు అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అయితే ఇందుకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయకపోవడం, అందులో వైసీపీ సర్కారు నాటి నిబంధనలే అమల్లో ఉండడం, అప్పటి ప్రభుత్వం చేసిన హౌస్‌హోల్డ్ సర్వేనే ప్రామాణికంగా తీసుకోవడం.. వంటి కారణాలతో చాలామంది అర్హులు కొత్త కార్డులకు దూరమవుతున్నారు.

● వైసీపీ తప్పులతో ఇప్పుడు కష్టాలు

వైసీపీ హయాంలో చేసిన హౌస్‌హోల్డ్ సర్వే ఇప్పుడు కొత్తగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారికి కష్టాలు తెచ్చి పెడుతోంది. అప్పట్లో పేర్ల నమోదు, ఇంటి నెంబర్లు తప్పుగా నమోదు చేశారు. రేషన్‌కార్డు దరఖాస్తుకు ఆ సర్వేని ప్రామాణికంగా తీసుకోవడంతో చిక్కులు ఎదురవుతున్నాయి. రేషన్‌కార్డులో సరిచేసుకునే అవకాశమిచ్చిన ప్రభుత్వం.. హౌస్‌హోల్డ్ సర్వేలోని వివరాలను సవరించుకునే అవకాశాన్నివ్వలేదు. ఉదాహరణకు ఒకే ఇంట్లోని రెండు కుటుంబాలు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారనుకుంటే హౌస్‌హోల్డ్ సర్వేలో ఒకే కుటుంబంగా ఉంటుంది కాబట్టి రెండో కుటుంబానికి రేషన్‌కార్డు అవకాశం రావడం లేదు. ఒకవేళ రెండో కుటుంబం విడిపోయి ఉన్నా, హౌస్‌హోల్డ్‌లోని పాత వివరాల కారణంగా కొత్త కార్డుకు అవకాశం లేదు. హౌస్‌హోల్డ్ సర్వే లోపాలను సవరించే అవకాశం కల్పిస్తేనే అర్హులకు లబ్ధి చేకూరుతుంది.

● పాత సాఫ్ట్‌వేర్‌తో ఇబ్బందులు..

రేషన్‌కార్డుల్లో ఏడు రకాలుగా మార్పు చేర్పులకు పౌరసరఫరాల శాఖ అవకాశమిచ్చినా అందుకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయలేదు. వైసీపీ హయాం నాటి ఆరంచెల తనిఖీ విధానానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. రేషన్‌కార్డు కోసం గత ప్రభుత్వంలో భూములు, వాహనాలు, విద్యుత్తు వినియోగంలో పరిమితులు వంటివాటి ఆధారంగా లబ్ధిదారుల్ని ఎంపిక చేస్తే.. ఇప్పుడూ అదే విధానాన్ని అనుసరిస్తున్నారు. గతంలో వైసీపీ అనేక ఆంక్షల్ని పెట్టి చాలా కార్డులను తొలగించింది. దీంతో అర్హులు కూడా కార్డుల్ని పొందలేకపోయారు. ఇప్పుడు అలాంటి వారు దరఖాస్తు చేసుకుందామంటే మళ్లీ అవే షరతులు, అవే ఆటంకాలు అడ్డుపడుతున్నాయి.

● వాట్సాప్ గవర్నెన్స్‌లో నో ఆప్షన్

ప్రభుత్వం ఇటీవల వాట్సాప్ గవర్నెన్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాట్సాప్‌లో రేషన్‌కార్డుకు సంబంధించిన ఏడు రకాల సేవలు అందుబాటులో ఉంటాయని తాజాగా ప్రకటించింది. అందులో సేవను ఎంపిక చేస్తే అవసరమైనవి రాకుండా.. దీపం స్థితి, రైస్ డ్రా స్థితి, రైస్ ఈకేవైసీ స్థితి, రైస్ కార్డు సమర్పణ వంటి నాలుగు ఆప్షన్లు మాత్రమే వస్తున్నాయి. టోల్‌ఫ్రీ నెంబర్లకు కాల్ చేస్తున్నా స్పందన లేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు.

● సాఫ్ట్‌వేర్‌లో అనేక సమస్యలు

రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే సాఫ్ట్‌వేర్‌లో అనేక సమస్యలు వెంటాడుతున్నాయి.నమోదు చేసుకునేటప్పుడు పొరపాటుగా జెండర్, రిలేషన్ మారిపోయి ఉంటే అలాంటి పొరబాట్లను సరిచేసుకునే అవకాశాన్నివ్వలేదు.అలాగే కార్డు విభజన కోసం చేసుకున్న అప్లికేషన్ వీఆర్వో లాగిన్ నుంచి తహసీల్దార్ లాగిన్‌కు పార్వర్డ్ కావడం లేదు. దీంతో తహసీల్దార్లు ఆమోదించలేకపోతున్నారు. అడ్రస్ మార్పు అప్లికేషన్లు వీఆర్వో లాగిన్లకు వెళ్లడం లేదు.

అర్హత ఉన్నా.. అవకాశం లేదు

ఈయన పేరు హేమాద్రి. జీడీనెల్లూరు మండలం వీరకనెల్లూరు గ్రామం. నాలుగేళ్ల కిందట పెళ్లయింది. ముగ్గురు పిల్లలున్నారు. తల్లిదండ్రులతో కాకుండా విడిగా నివాసం ఉంటున్నారు.కానీ ఇప్పటివరకు రేషన్‌కార్డు లేదు. ఫలితంగా ఇంటి స్థలం కూడా రాలేదు. తాజాగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఉమ్మడి కుటుంబం అని ఉంది, కొత్త కార్డు రాదంటున్నారు. ఇలాంటి వారికి కార్డు రానపుడు ఇక దరఖాస్తు చేసుకునే అవకాశమిచ్చి ప్రయోజనమేంటనేది ప్రశ్న.



జిల్లాలో రేషన్‌కార్డులు	5,43,259
కొత్త కార్డుల కోసం అందిన దరఖాస్తులు	21761
చిరునామా మార్పు	361
ఆధార్ సీడింగ్ మార్పు	335
కార్డులో జత చేసేందుకు	17621
తొలగించేందుకు	375
కొత్త కార్డుల కోసం	2418
విభజన	1941
సరెండర్	41



పలమనేరు చేరుకున్న కుంకీలు

పలమనేరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లాలో మద గజాలను కట్టడి చేసేందుకు కర్ణాటక నుంచి బయల్దేరిన 4కుంకీ ఏనుగులు బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో పలమనేరు చేరుకొన్నాయి.ఒక్కో ఏనుగును ఒక్కో లారీలో తీసుకువచ్చారు. పలమనేరు చేరుకొన్న కుంకీ ఏనుగులను ముసలిమడుగు వద్ద సిద్ధం చేసిన ఎలిఫెంట్ క్యాంప్ ప్రాంతానికి తరలించారు.దాదాపు మూడున్నర దశాబ్దాలుగా ఏనుగులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటలను నాశనం చేయడంతో పాటు రైతులను సైతం తొక్కి చంపి వేసిన ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి.ఈ నేపథ్యంలో శిక్షణ పొందిన కుంకీ ఏనుగుల సాయంతో మదగజాల పనిబట్టాలని అటవీశాఖ నిర్ణయించింది. ఏనుగులు అటవీ సరిహద్దు గ్రామాల వద్దకు వచ్చినప్పుడు కుంకీ ఏనుగుల సాయంతో వాటిని లోతట్టుప్రాంతాలకు తరిమివేయడంతో పాటు ఒంటరిగా తిరుగుతున్న ఏనుగులను ఈ ఎలిఫెంట్ క్యాంప్ ప్రాంతానికి కుంకీల సాయంతో తీసుకువచ్చి బంధించేందుకు క్రాల్స్ కూడా సిద్ధం చేశారు.



పిడుగుపాటుకు మహిళ మృతి

కేవీబీపురం, మే 21(ఆంధ్ర జ్యోతి): కేవీబీపురం మండలంలో పిడుగుపాటుకు గురై ఓ గిరిజన మహిళ మృతి చెందింది. ఆదరం గ్రామశివారులోని మామిడితోటకు రాజా, చుక్కమ్మ(25) దంపతులు, ముగ్గురు పిల్లలతో కలిసి కాపలాగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఆ సమయంలో బయట ఉన్న వస్తువులను ఇంట్లోకి తెచ్చేందుకు చుక్కమ్మ వెళ్లగా పిడుగు పడటంతో అక్కడికక్కడే ఆమె మరణించింది. తహసీల్దారు మునిరత్నంరెడ్డి బుధవారం ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌కు కొత్త హంగులు

సూళ్లూరుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకం కింద సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను రూ.14.50 కోట్లతో ఆధునికీకరించారు. సకల వసతులతో కొత్త హంగులు సంతరించుకున్న రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో గురువారం ప్రారంభించనున్నారు.

శివపార్వతుల కల్యాణ మండపానికి రూ.లక్ష విరాళం



సోమలలో విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

సోమల, మే 21 (ఆంధ్రజ్యోతి): సోమల శివాలయానికి అనుబంధంగా నిర్మాణంలో ఉన్న శివపార్వతుల కల్యాణ మండపానికి సోమలకు చెందిన సీఎం సురేష్, సీఎం సంగీత దంపతులు రూ.లక్ష విరాళాన్ని బుధవారం ఆలయ ధర్మకర్త బీవీ సోమశేఖర్‌కు అందించారు. దాత కుటుంబ సభ్యులు ఆలయంలో అభిషేకాలు చేపట్టారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సదుం ఏఎస్ఐ సత్యనారాయణ, విశ్రాంత ఎల్ఐ వీవీ రమణ, లింగయ్య, సరస్వతమ్మ, మధుసూదన్, శంకర్‌రెడ్డి, పాయల రమేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం



సభ్యత్వం కార్డులను పంపిణీ చేస్తున్న గువ్వల రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పరికిదొన పంచాయతీ అధ్యక్షుడిగా చెంగ్రలాయప్ప, గడ్డంవారిపల్లె అధ్యక్షుడిగా ముని వెంకటప్ప, అమినిగుంట అధ్యక్షుడిగా శంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంపాల శ్రీనివాసులు నాయుడు, వేలూరు సుబ్రహ్మణ్యం, నాగరాజరెడ్డి, చంద్రమౌళి, కుమార్‌రెడ్డి, అమీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

రొంపిచెర్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని.. అధికారులు నిరంతరం ప్రజల్లో ఉండాలని ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం రొంపిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు జరగాలన్నారు. జలజీవన్ మిషన్‌లో జరుగుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. రొంపిచెర్ల బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న తరగతి గదుల బిల్లులు చెల్లించాలని ఎంపీటీసీ సిరాజ్‌ఉన్నీషా కోరారు. మండల సమావేశాలకు హాజరు కాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సూచించారు. డీటీ లోకేష్, జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు ప్రారంభం



తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎంపీడీవో ఖాదర్‌బాషా

పలమనేరు, మే 21 (ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతంలోని ఏటిగడ్డిండ్లు గ్రామస్తులకు తాగునీటి వసతి కల్పించిన వాటర్ ఎయిడ్ సంస్థ సేవలు అభినందనీయమని పలమనేరు ఎంపీడీవో ఖాదర్‌బాషా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెంగరగుంట పంచాయతీ ఏటిగడ్డిండ్లు గ్రామంలో ఆ సంస్థ నిర్మించిన తాగునీటి ట్యాంకు, ఇంటింటికి కొళాయిలను ఎంపీడీవో ప్రారంభించారు. కార్యక్రమంలో పలమనేరు మండల టీడీపీ అధ్యక్షులు నాగరాజరెడ్డి, వాటర్ ఎయిడ్ సంస్థ సిబ్బంది, సర్పంచ్ భువనేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి లోకనాథం, టీడీపీ నాయకులు జయప్రకాష్, రామచంద్రనాయుడు, సోము, ఉమాపతినాయుడు, బాబునాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుస్తుల దుకాణంలో పాము హల్‌చల్



పలమనేరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు వి.వి.మహల్ రోడ్డుపక్కనే ఉన్న రిక్రియేషన్ క్లబ్ వాణిజ్య సముదాయంలోని షణ్ముగానికి చెందిన దుస్తుల దుకాణంలోకి బుధవారం మధ్యాహ్నం పాము దూరి హల్‌చల్ చేసింది. స్నేక్ క్యాచర్‌ను పిలిపించి పామును పట్టి దూరంగా విడిచిపెట్టారు. నిత్యం రద్దీగా ఉండే వి.వి.మహల్ రోడ్డుపక్కన దుకాణంలో పాము చేరడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

పారదర్శకంగా అభివృద్ధి పనులు చేపట్టాలి



చల్లా రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజేష్ తదితరులు

కల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): కల్లూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి పనులు పారదర్శకంగా చేపట్టాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సూచించారు. చల్లా రామచంద్రారెడ్డి కల్లూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి నిధులు కావాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. దీంతో బుధవారం ఆస్పత్రి చైర్మన్ రాజేష్‌తోపాటు టీడీపీ నాయకులు చల్లా ఇంటికి చేరుకుని ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరుణాకర్‌నాయుడు, అనిల్‌కుమార్, అబ్బాస్, అన్సర్ బాషా, మునిరత్నం, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

నేడు సింగసముద్రంలో శ్రీరామకోటి నామస్మరణ

రామకుప్పం, మే 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం సింగసముద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం శ్రీరామకోటి నామస్మరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం ఉదయం 5 గంటలకు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాల అనంతరం శ్రీరామకోటి నామస్మరణ ప్రారంభమవుతుందన్నారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు కార్యక్రమం ముగింపు సందర్భంగా మహా తులసి అర్చన, మహా మంగళ హారతి జరుగుతుందన్నారు. రెండు రోజులపాటు ఆలయంలో అన్నదాన ం జరుగుతుందని తెలిపారు.

ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ల కేటాయింపు

కల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లను పంచాయతీల వారీగా కేటాయించినట్లు ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఏపీవో సౌభాగ్యవతి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ మండలంలోని అయ్యావాండ్లపల్లి, దేవళంపేట, గడ్డంవారిపల్లి, కమ్మపల్లి, రెడ్డివారిపల్లి పంచాయతీలకు టీఏగా కీర్తిని నియమించినట్లు పేర్కొన్నారు. అలాగే బోడిరెడ్డిగారిపల్లి, చల్లావారిపల్లి, మంగళంపేట, నన్నూరివారిపల్లి, ఎల్లంకివారిపల్లి పంచాయతీలకు టీఏగా కిరణ్‌కుమార్, దిగువపోకలవారి పల్లి, మతుకువారిపల్లి, పులిచెర్ల, 106 రామిరెడ్డిగారిపల్లి, రేణుమాకులపల్లి పంచాయతీ లకు టీఏగా మహేంద్ర, కల్లూరు, కావేటిగారిపల్లి, పోశంవారిపల్లి, పాతపేట, వెంకటదాసరపల్లి టీఏగా జ్యోతీశ్వర్‌రెడ్డి, 102 ఈ రామిరెడ్డిగారిపల్లి, ఎర్రపాపిరెడ్డిగారిపల్లి, పాళెం, రాయవారిపల్లి, రాజులపల్లి పంచాయతీలకు టీఏగా సుభాషిణిలను నియమించినట్లు తెలిపారు.

నేడు సోమలలో మినీ మహానాడు

చౌడేపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): సోమలలో గురువారం జరగనున్న మినీ మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షులు రమేష్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చౌడేపల్లె మండలంలోని టీడీపీ కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చురుగ్గా ఈడ్గాలో అభివృద్ధి పనులు

రొంపిచెర్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల ఈడ్గా వద్ద రూ.35 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు, ప్లాట్‌ఫారం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బుధవారం ఈ పనులను పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పరిశీలించి నాణ్యతగా .. త్వరగా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఉయ్యాల రమణ, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, రఫీ, బాబులాల్, చిన్ననాగరాజ, మహమ్మదాలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో కార్యకర్తలకు గుర్తింపు



సభ్యత్వ కార్డులను అందజేస్తున్న మాధవరెడ్డి

పుంగనూరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పుంగనూరు రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మంగళం గ్రామంలో టీడీపీ సభ్యత్వ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వడంలో టీడీపీ ప్రథమ స్థానంలో ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సోము, సంజీవ, గంగాధర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధ్యక్ష పదవుల్లో కొత్తవారికే అవకాశాలు



పలమనేరు, మే 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో పలు మండలాల్లో పార్టీ అధ్యక్షులుగా కొత్తవారు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆరేళ్లపాటు పార్టీ పదవుల్లో కొనసాగిన వారికి మళ్లీ కొనసాగే అవకాశాలు ఉండవని నారా లోకేష్ చెప్పడంతో నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఇప్పటికే దశాబ్ద కాలంగా పార్టీ పదవుల్లో ఉన్నవారికి ఉద్వాసన తప్పదని తెలుస్తోంది. నియోజకవర్గంలో పలమనేరు మున్సిపాలిటీ, పలమనేరు మండలం, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాలు ఉన్నాయి. ఇందులో బైరెడ్డిపల్లి, వి.కోట, పలమనేరు మున్సిపాలిటీలో ఉన్న పార్టీ అధ్యక్షులు గత దశాబ్దకాలంగా పార్టీ అధ్యక్ష పదవుల్లో కొనసాగుతున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వీరిలో కొందరిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఓ నేత జాతీయ రహదారిపై గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్లపేరుతో అక్రమ రవాణాకు సిద్ధం చేసి ఉంచిన వెయ్యి టిప్పర్లకు పైగా ఇసుకను ఎన్నికల ఫలితాలు వెలువడిన వారం రోజుల్లోపు కర్ణాటకకు తరలించి సొమ్ముచేసుకున్నారు. ప్రభుత్వం ఇటీవల గోకులం షెడ్లు మంజూరు చేయగా అందులో ఓ నేత షెడ్డుకు రూ.10 వేలు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మునిగి లేఅవుట్లకు చెరువుల నుంచి అక్రమంగా వేలాది టిప్పర్ల మట్టిని, ఇసుకను తరలించినట్లు మరో నేత ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఇక మండలాల్లో బెల్టు షాపుల ఏర్పాటులో ఒక నేత కీలక పాత్ర పోషించి ఒక్కో బెల్టుషాపు నుంచి రూ.లక్ష వరకు దండుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చాయి. మరోనేత పలమనేరులో లాటరీ టిక్కెట్లు, మరోనేత గంజాయి అమ్మకాలు, పేదల కాలనీల్లో స్థలాల అక్రమ అమ్మకాలకు పాల్పడుతున్నట్లు మరొక్క నేతపై ఆరోపణలు వస్తున్నాయి. నియోజకవర్గంలోని ఒక వర్గానికి చెందిన వారు ఈ ఉదంతాలను పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌కు స్వయంగా వెళ్లి వివరించారని తెలుస్తోంది. దీంతో నారాలోకేష్ ఈ ఆరోపణల్లో వాస్తవాలను నిఘావర్గాల నుంచి రిపోర్టులు తెప్పించుకొన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ విషయాలు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దృష్టికి వెళ్లకపోవడం గమనార్హం. ఎమ్మెల్యేకు అతి సన్నిహితంగా మెలిగే వ్యక్తి ఎమ్మెల్యేకు సైతం ఈ విషయాలు తె లియకుండా వ్యవహరించడంలో కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. అయితే సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో ఇలా అవినీతి ఆరోపణలు ఉన్నవారిని, నారా లోకేష్ సూచించిన పదవుల నుంచి తప్పించడం ఆధారంగా వీరికి పార్టీ అధ్యక్ష పదవులకు దూరంగా పెట్టేందుకు రంగం సిద్ధం అయినట్లు కూడా తెలుస్తోంది. నియోజకవర్గంలో అందరూ పార్టీ కోసం పని చేస్తున్నారని.. మండల స్థాయిలో మెజారిటీ కార్యకర్తలు, వివిధ స్థాయి నాయకుల అభిప్రాయం మేరకు మండల పార్టీ అధ్యక్షుల నియామకానికి ఎమ్మెల్యే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మహానాడుకు ముందే సంస్థాగత ఎన్నికలు పూర్తిచేసేందుకు పార్టీ ఆదేశాలు ఉన్నందున మరో వారం రోజుల్లోపూ మండల పార్టీ అధ్యక్షుల నియామకం పూర్తికానున్నట్లు సమాచారం. పలు మండలాల్లో కొత్తవారికి అధ్యక్ష పదవి వచ్చే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

రాజసం.. గంగమ్మ విశ్వరూపం



ప్రజలతో మాట్లాడుతున్న చంద్రబాబు



గంగమ్మ విశ్వరూపం

కుప్పం, మే 21 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో గంగమ్మ జాతర మహోత్సవాల చివరి ఘట్టమైన ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మవారి విశ్వరూప దర్శనం బుధవారం వైభవంగా జరిగింది. లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. శిరస్సుపై కలశాలు ధరించిన ఆడవాళ్లు.. విచిత్ర వేషాలు కట్టినవారు మొక్కులు తీర్చుకుని అమ్మవారి చల్లని ఆశీర్వాదాలు పొందారు. కుప్పం గంగమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు దర్శించుకున్నారు.



అమ్మవారి ఆలయం ఎదుట భక్తుల కోలాహలం



చంద్రబాబుతో కంచర్ల శ్రీకాంత్



ప్రజలతో చంద్రబాబు కరచాలనం



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కడా పీడీ, జేసీ



ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే మురళీమోహన్



ముఖ్యమంత్రితో గౌనివారి శ్రీనివాసులు



సీఆర్ రాజన్‌తో మాట్లాడుతూ ...







వివిధ వేషధారణలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

భక్తులతో పోటెత్తిన గంగమ్మ ఆలయం



గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

సోమల, మే 21 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో గంగజాతర సందర్భంగా బుధవారం నడివీధి గంగమ్మను దర్శించుకునేందుకు జనం పోటెత్తారు. అమ్మవారి నిజరూప దర్శనం చేసుకున్నారు. మహిళలు అమ్మవారికి అంబళ్లు, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. మాజీ వీఎం చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి నుంచి అమ్మ వారికి ఇష్టమైన కల్లుకు పూజలు నిర్వహించి సమర్పించారు. మలిశెట్టి కుటుంబ సభ్యులు నగిరి దీలను, చిన్నయ్యగారి కుటుంబ సభ్యులు మసెమ్మ భారీ దీలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. గన్నావారిపల్లె, అడుసుపల్లె, డిడ్డివారిపల్లె, మఠంగొల్లపల్లె, ముండ్రివారిపల్లె, చిన్నసోమలలో గంగజాతర వేడుకలు జరుపుకొని సాయంత్రం నడివీధి గంగమ్మ దర్శనం కోసం క్యూకట్టారు. కార్యక్రమాలను వరదం వెంకటరమణ, చెన్నరాయప్ప, సుధాకర్, జగన్‌మోహన్, వీవీ శివశంకర్, మహేంద్రబాబు, రమేష్, ఐలా సురేంద్ర పర్యవేక్షించారు.

బాలుడిపై దాడి - కేసు నమోదు

బంగారుపాళ్యం, మే 21 (ఆంధ్రజ్యోతి): దొంగతనం చేశాడనే నెపంతో ఓ బాలుడిపై మెకానిక్ షెడ్ యజమాని దాడిచేసి గాయపరిచిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు... ఈ నెల 19వ తేదీన వడ్డూరుకు చెందిన మునిరత్నం కుమారుడు చైతన్య రాగిమానుపెంట రోడ్డు సమీపంలోని మెకానిక్ షెడ్డులో ద్విచక్ర వాహనానికి సంబంధించిన ఒక వస్తువును దొంగిలించాడని షెడ్డు యాజమాని బాలాజీ బాలుడు చైతన్యను కొట్టి గాయపరిచాడు. దీంతో గాయపడ్డ బాలుడిని చికిత్స నిమిత్తం తండ్రి మునిరత్నం చిత్తూరులోని ఓ ఆస్పత్రిలో చేర్పించాడు. మునిరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదకర పిచ్చిమొక్కల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్




విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చిమొక్కలను తొలగించిన అధికారులు

చౌడేపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదకరంగా ఉన్న పిచ్చిమొక్కలు, తీగలను విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం తొలగించారు. చారాల ఎస్సీ కాలనీ సమీపంలో 'ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వార్తా కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ప్రమాదకరంగా ఉన్న పిచ్చిమొక్కలు, తీగలు తొలగించారు.

ఉపాధి లక్ష్యాలు పూర్తి చేయాలి

చౌడేపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల పనుల లక్ష్యాలను సిబ్బంది పూర్తి చేయాలని ఏపీవో చిన్నరెడ్డెమ్మ సూచించారు. బుధవారం ఆమె ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రతి పంచాయతీలో 100 మంది కూలీలకు పనులు కల్పించాలని, రైతులు ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతవారం చేసిన పనుల రికార్డులు పరిశీలించారు.

మంగళం టీడీపీ అధ్యక్షుడిగా మాధవరెడ్డి



పుంగనూరు రూరల్, మే 21 (ఆంధ్ర జ్యోతి): పుంగనూరు మండలం మంగళం పంచాయతీ టీడీపీ అధ్యక్షుడిగా మాధవరెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. బుధవారం గ్రామ పంచాయతీలోని నాయకులు, కార్యకర్తల సమావేశంలో పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించగా గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ, సోము, రమణ తదితరులు పాల్గొన్నారు.






కుప్పం పర్యటనలో గంగమ్మ ఆలయం వద్ద భక్తజనానికి చంద్రబాబు అభివాదం - కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు చంద్రబాబు సూచనలు - సీఎం చంద్రబాబుతో డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర రెడ్డి

జిల్లావ్యాప్తంగా వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, మే 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా అంతటా గుడుపల్లి, కుప్పం మండలాలు మినహా బుధవారం 29 మండలాల్లో విస్తృతంగా వర్షం కురిసింది. మండలాలవారీగా విజయపురంలో 43.6, శ్రీరంగరాజపురంలో 42.4, చౌడేపల్లిలో 40.6, పాలసముద్రంలో 37.4, కార్వేటినగరంలో 35.6, పెనుమూరులో 35.2, యాదమరిలో 29.6, గంగాధరనెల్లూరులో 28.6, గంగవరంలో 27.2, తవణంపల్లెలో 25.6, పలమనేరులో 25.2, నింద్రలో 24.4, రొంపిచెర్లలో 24.2, చిత్తూరు, పులిచెర్ల మండలాల్లో 23.0, వి.కోటలో 22.4, ఐరాలలో 16.2, పూతలపట్టులో 13.2, సదుంలో 13.2, నగరిలో 11.2, బంగారుపాళ్యంలో 11.0, వెదురుకుప్పం, గుడిపాల మండలాల్లో 10.2, పెద్దపంజాణిలో 7.6, బైరెడ్డిపల్లిలో 5.4, రామకుప్పంలో 4.2, సోమలలో 2.8, శాంతిపురంలో 2, పుంగనూరులో 1 మిమీ వర్షం కురిసింది.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 707 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మే 21 (ఆంధ్రజ్యోతి): టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను బుధవారం జిల్లా వ్యాప్తంగా 36 కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈవో వరలక్ష్మి, ఏసీ వెంకటేశ్వరరావు తెలిపారు. మొత్తం 3160 మంది విద్యార్థులకు గాను 2453 మంది హాజరు కాగా, 707 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. టెన్త్ జనరల్ విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టులో నిర్వహించిన పరీక్షలకు 1785 మందికిగాను 1382 మంది హాజరు కాగా, 403 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ఓపెన్ స్కూల్ టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన తెలుగు, ఉర్దూ, తమిళం పరీక్షలకు 268 మందికి గాను 171 మంది హాజరు కాగా, 97 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం సబ్జెక్టుల్లో నిర్వహించిన పరీక్షలకు 1107 మందికి గాను 900 హాజరు కాగా, 207 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

మినీ లారీని ఢీకొన్న కేఎస్ ఆర్టీసీ బస్సు

● తృటిలో తప్పిన పెనుప్రమాదం




మామిడి తోపులోకి దూసుకెళ్లిన కేఎస్ ఆర్టీసీ బస్సు - రోడ్డుపై బోల్తాపడిన మినీ లారీ

పూతలపట్టు, మే 21 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న మినీ లారీని ఢీకొట్టి రోడ్డు పక్కనున్న మామిడి తోపులోకి బస్సు దూసుకెళ్లిన సంఘటనలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. కేఎస్‌ఆర్టీసీ బస్సు మంగళవారం అర్ధరాత్రి మైసూరు నుంచి తిరుపతి వెళ్లేందుకు పూతలపట్టు మండలం కిచ్చన్నగారిపల్లి సిక్స్ లేన్ రోడ్డుపై ముందుగా వెళ్తున్న మినీ లారీని ఓవర్‌టేక్ చేయబోతూ ఢీకొట్టింది. దీంతో మినీ లారీ రోడ్డుపై బోల్తాపడింది. అనంతరం బస్సు సిక్స్ లేన్ డివైడర్‌ను ఢీకొని రోడ్డు పక్కనున్న ఓ రైతుకు చెందిన మామిడి తోపులోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో మినీ లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. బస్సులో వున్న 40 మంది ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.

టీటీడీ గోసంరక్షణ కేంద్రం తనిఖీ



గోసంరక్షణ కేంద్రంలో ఆవులను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

పలమనేరు, మే 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని సుమారు 450 ఎకరాల స్థలంలో టీటీడీ నిర్వహిస్తున్న గోసంరక్షణ కేంద్రాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోశాలలోని ఆవులను పరిశీలించారు. కేంద్రం ఆవరణ అపరిశుభ్రంగా ఉండటం, నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజుల్లోపు గోశాల రోజువారి నిర్వహణ నివేదిక తయారు చేసి తనకు పంపాలని అధికారులను ఆదేశించారు.

టెంపోను ఢీకొన్న ద్విచక్రవాహనం

● ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు

సోమల, మే 21 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం చెరువు సమీపంలో ఆగిఉన్న టెంపోను ద్విచక్రవాహనం అదుపుతప్పి ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా ఇద్దరు గాయపడ్డారు. ఎస్‌ఐ శివశంకర్ కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం రాణిపేట సమీప కళవళికి చెందిన ప్రకాష్(27), మణికంఠ(28), గోపాల్(26) వరికోత యంత్రం డ్రైవర్లుగా ఇరికిపెంట పంచాయతీలో పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి పనులు ముగించుకుని సోమలకు ద్విచక్రవాహనంలో వచ్చి తిరిగి చౌడేపల్లె మార్గంలో బయలుదేరారు. చెన్నపట్నం చెరువు సమీపంలో రోడ్డు పక్కనే ఆగి ఉన్న టమోటా లోడ్డు టెంపోను ఢీకొన్నారు. ప్రమాదంలో ప్రకాష్ అక్కడికక్కడే మృతిచెందగా.. మణికంఠ, గోపాల్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరిని వేలూరు సీఎంసీ వైద్యశాలకు తరలించారు. ప్రకాష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమ్మపల్లెలో ఏనుగుల దాడులు

సోమల, మే 21 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం రాత్రి చిన్న ఉప్పరపల్లె పంచాయతీ కమ్మపల్లె సమీపంలోని మామిడి, టమోటా తోటల్లో ఏనుగుల గుంపు చేరుకొని పంటలను ధ్వంసం చేశాయి. రైతులు రమణ, వెంకట్రామయ్య మామిడి తోటల్లో మామిడి కాయలను తిన్నంత తిని కొమ్మలను విరిచేశాయి. కోత సమయంలో ఏనుగుల సంచారంతో రైతులు ఆందోళన పడుతున్నారు.

విద్యుదాఘాతంతో పారిశుధ్య కార్మికుడి మృతి



మృతుడు రెడ్డెప్ప (ఫైల్ ఫొటో)

పుంగనూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం పుంగనూరు మండలంలో జరిగింది. వివరాలిలా.. మండలంలోని చంద్రమాకులపల్లెకు చెందిన కొండప్ప కుమారుడు రెడ్డెప్ప (54) పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. గ్రామంలో విద్యుత్ తీగలకు మునగ చెట్టు కొమ్మలు తగులుతున్నట్లు గుర్తించి కొమ్మలను తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. గాయపడిన కార్మికుడిని కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రెడ్డెప్ప మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సీఐ సుబ్బరాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండల అధికారులు సక్రమంగా పనిచేస్తే గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు ఎందుకొస్తాయి?

● ఏవోలపై జడ్పీ సీఈవో ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

చిత్తూరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో అధికారులు పనిచేస్తే గ్రీవెన్స్‌కు సమస్యలు ఎందుకు వస్తాయని ఏవోలపై జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల ఏవోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మండలంలో నెలకొన్న సమస్యలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మండల స్థాయిలో పరిష్కరిస్తే ప్రజలు కష్టపడి కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం ఉండదు కదా అని ప్రశ్నించారు. ఎంపీడీవో కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం లేదని, ఫిర్యాదులు స్వీకరించడం లేదని, స్వీకరించినా వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఎంపీడీవో కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించాలని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. చాలా మంది ఏవోలకు కనీసం వర్కులకు సంబంధించి ఎస్టిమేట్ వేయడం కూడా రావడం లేదని, అన్ని తప్పులుగా వేస్తున్నారని అన్నారు. మరి కొన్ని చోట్ల అవసరాని కన్నా అధికంగా ఎస్టిమేట్ వేస్తున్నారని ఆగ్రహించారు. ప్రజా ధనాన్ని సక్రమంగా ఖర్చు చేయాలని సూచించారు. అధికారుల పద్ధతి మారాలని, అభివృద్ధి పనుల్లో రాజకీయ రంగు పులమొద్దని హెచ్చరించారు. పంచాయతీరాజ్ పరిధిలో బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తామని అన్నారు. ఐదేళ్లు పూర్తైన వారిని బదిలీ చేస్తామని, అధికారులకు కావాల్సిన ప్రాంతాల్లో వారి ఇష్టం మేరకే బదిలీ చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో జుబేదా, జడ్పీ ఏవో గిరిధర్‌రెడ్డి, ఏవోలు పాల్గొన్నారు.

డీసీహెచ్ఎస్ కార్యాలయంలో డిప్యుటేషన్ల రద్దు దుమారం

● తనకు తెలియదంటున్న డీసీహెచ్ఎస్ ● ఏపీవీపీ కమిషనర్‌కు బాధితుల ఫిర్యాదు

చిత్తూరు రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.ఉన్నతాధికారి ఉన్నప్పటికీ ఆమెతో సంబంధం లేకుండా అయిన వారికి డిప్యుటేషన్లు ఇస్తూ...కాని వారికి రద్దు చేస్తూ ఇష్టానుసారంగా నడుచుకుంటున్నారని విమర్శలొస్తున్నాయి. అడిగితే ప్రభుత్వ పాలసీ అని ఒకరు, ఉన్నతాధికారుల ఆదేశాలని మరొకరు తప్పించుకుంటున్నారని చెబుతున్నారు.జిల్లా వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఒక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, 4 ఏరియా, 8 సీహెచ్‌సీలు వున్నాయి. ఈ ఆస్పత్రులన్నిటికి డీసీహెచ్ఎస్ ఉన్నతాధికారిగా వ్యవహరిస్తారు.డీసీహెచ్ఎస్ పరిధిలో 550 మందికిపైగా వైద్యులు, పారామెడికల్, స్టాఫ్‌నర్సులు, వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. అందులో కుటుంబ సమస్యలతో బాధపడుతున్నవారితో పాటు కుటుంబ సభ్యుల్లో దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారిని చూసుకునేందుకు ఉద్యోగుల అభ్యర్థన మేరకు కమిషనర్ ఆదేశాలతో సుమారు 40 మందికి డిప్యుటేషన్లు ఇచ్చారు.వీరిలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కూడా ఉన్నారు. వారి డిప్యుటేషన్ రద్దు చేయాలంటే కమిషనర్ నుంచి ఆదేశాలు రావాలి, వచ్చినా వాటిని డీసీహెచ్ఎస్ రద్దు చేయాల్సి ఉంటుంది. అయితే ఇటువంటి ఆదేశాలు లేకుండానే డిప్యుటేషన్‌పై ఉన్న వారిలో 10 మందిని ఎంపిక చేసి రెండు రోజుల క్రితం డిప్యుటేషన్లు రద్దు చేశారు. దీనిపై ప్రశ్నించిన ఉద్యోగులను తాను కమిషనరేట్‌లో పనిచేశానని , ఎక్కువ మాట్లాడితే సస్పెండ్ చేయిస్తానంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కష్టపడి తెచ్చుకున్న డిప్యుటేషన్లను ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి, డీసీహెచ్ఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న మరో చిన్న స్థాయి ఉద్యోగి కలిసి రద్దు చేస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.దీనిపై బాధితులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవిని వివరణ కోరగా డిప్యుటేషన్ల రద్దు విషయం తనకు తెలియదని తెలిపారు.

తుడా అభివృద్ధికి కృషి చేస్తా

● చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన డాలర్స్ దివాకర్ రెడ్డి



బాధ్యతలు చేపడుతున్న దివాకర్‌రెడ్డి

తిరుపతి, మే21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్‌గా డాలర్స్ దివాకర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తుడా కార్యాలయంలో వీసీ మౌర్య, కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ బాబు సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. సాయంత్రం పెరుమాళ్లపల్లె నుంచి ద్విచక్రవాహనాల్లో ర్యాలీగా వచ్చారు. టౌన్ క్లబ్ కూడలి నుంచి ఓపెన్ టాప్ వాహనంపై ర్యాలీగా ఇందిరాప్రియదర్శిని కూరగాయల మార్కెట్ ఎదురుగా ఏర్పాటుచేసిన వేదికవద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, మురళీకృష్ణ, విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ, సునీల్ కుమార్, టీటీడీ సభ్యురాలు పనబాక లక్ష్మి, మాజీ మంత్రి పరసా రత్నం తదితరులు పాల్గొని డాలర్స్ దివాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. గత ఐదేళ్లలో తుడాను తుడిచిపెట్టిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులపై వేగవంతంగా చర్యలు తీసుకునేందుకు దివాకర్ కృషిచేయాలన్నారు. అనంతరం తుడా చైర్మన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఇచ్చిన బాధ్యతకు చెడ్డపేరు తీసుకురానని చెప్పారు. భగవంతుడి సాక్షిగా తుడాలో తప్పుచేయనన్నారు. దుష్టుడు, దుర్మార్గుల పాలన నుంచి తుడా విముక్తి అయిందన్నారు. తనను అవమానించిన చోటే తిరిగి చైర్మన్‌గా వచ్చానన్నారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ పరిచయకర్తగా వ్యవహరించిన ఈకార్యక్రమంలో కూటమి నాయకులు నరసింహ యాదవ్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, మబ్బు దేవనారాయణ రెడ్డి, కోలా ఆనంద్, దయాకర్ రెడ్డి, శ్రీధర్ వర్మ, రుద్రకోటి సదాశివం, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, ఊట్ల సురేంద్ర నాయుడు, అన్నా అనిత, కుమారమ్మ, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ ఆశిష్



మంత్రి లోకేశ్ నుంచి అవార్డు అందుకుంటున్న పాలమంగళం విద్యార్థి

నారాయణవనం, మే 21(ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలం పాలమంగళం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.ఆశిష్ షైనింగ్ స్టార్ అవార్డును విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ నుంచి అందుకున్నారు. పదో తరగతి చదువుతున్న ఇతడు సీడబ్ల్యూఎస్ఎన్ విభాగంలో జిల్లా స్థాయిలో 500కి 481 మార్కులు సాధించారు. బుధవారం అమరావతిలో ప్రభుత్వం నిర్వహించిన 'విద్యార్థులు షైనింగ్ స్టార్స్' కార్యక్రమంలో షైనింగ్ స్టార్ అవార్డును లోకేశ్ నుంచి అందుకున్నారు. ఆశిష్‌ను, అతడి తల్లిదండ్రులు ఆనంద్, ఉమాదేవిని మంత్రి అభినందించారు.

ఏపీఈఏపీసెట్ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2025 బుధవారం ప్రారంభమైంది. ఈ నెల 27వ వరకు ఈ పరీక్షలు కొనసాగుతాయి.చంద్రగిరి సమీపంలోని చెర్లోపల్లె వద్ద గల టీసీఎస్ ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఈ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ పరీక్షలను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కాగా, కాకినాడ జేఎన్‌టీయూ ఈ పరీక్షలు నిర్వహిస్తోంది.

నౌకా నిర్మాణ కేంద్రానికి స్థల పరిశీలన

వాకాడు, మే 21 (ఆంధ్రజ్యోతి):తిరుపతి జిల్లా వాకాడు మండలం దుగరాజపట్నం సముద్రతీరంలో చేపట్టనున్న నౌకా నిర్మాణ కేంద్రానికి తహసీల్దారు రామయ్య, సర్వేయర్ శకుంతల బుధవారం ప్రాథమికంగా స్థల పరిశీలన చేపట్టారు. దీనికి 2700 ఎకరాలు కావాల్సి ఉండగా, ఇప్పటికే 400 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని తహసీల్దారు తెలిపారు. తూపిలిపాళెం తీరంలో 14 హేచరీలకు సంబంధించి 150 ఎకరాలు ఉన్నాయని, ఆయా యాజమాన్యాలతో మాట్లాడామన్నారు. వాగుర్రు, వల్లమేడు, పామాంజిలోని రైతులను కలిసి భూములను ఇవ్వాలని కోరామని తహసీల్దారు చెప్పారు.

స్విమ్స్‌లో అతిక్లిష్టమైన సర్జరీ



చికిత్స అనంతరం కోలుకున్న బాధితురాలు

తిరుపతి(వైద్యం), మే 21 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లోని సిటి సర్జరీ విభాగం ఆధ్వర్యంలో 24 ఏళ్ల మహిళకు అతిక్లిష్టమైన సర్జరీని విజయవంతంగా నిర్వహించామని సిటి సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సత్యవతి తెలిపారు. కర్నూలు జిల్లా మంత్రాలయ మండలం పరమాన్‌దొడ్డి తండాకు చెందిన అన్నా బాయ్(24) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఈనెల ఒకటో తేదీన స్విమ్స్‌కు వచ్చింది. సిటి సర్జరీ విభాగం వైద్యులు ఆమెను పరీక్షించి అఖండ్రోప్లాసియా (మరగుజ్జు) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. దీంతోపాటు గుండెలోని రెండు కవాటాలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. సిటి సర్జరీ విభాగం ఆధ్వర్యంలో అతిక్లిష్టమైన సర్జరీ చేశారు. రెండు కవాటాలను కూడా మార్చి సర్జరీని విజయవంతం చేశారు. బాధిత మహిళ కోలుకోవడంతో బుధవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ మాట్లాడుతూ స్విమ్స్‌లో అనుభవం కలిగిన నిపుణులతోపాటు అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులో ఉండటం వలన సర్జరీలను విజయవంతంగా చేసే అవకాశం లభిస్తోందన్నారు. ఇలాంటి సర్జరీకి రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని, కానీ టీటీడీ ప్రాణదాన ట్రస్టు కింద పూర్తి ఉచితగా చేశామని చెప్పారు. వైద్య బృందాన్ని ఆయన అభినందించారు.




సీఎం హెలిపాడ్ వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ మణికంఠ - సీఎం కాన్వాయ్ వెంట కలెక్టర్ సుమిత్‌కుమార్ పరుగులు

మహానాడును విజయవంతం చేద్దాం

నేడు చిత్తూరు టీడీపీ కార్యాలయంలో జిల్లా స్థాయి మహానాడు



మహానాడు ఏర్పాట్లపై టీడీపీ జిల్లా కార్యాలయంలో సమావేశమైన నేతలు

చిత్తూరు సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): మహానాడును విజయవంతం చేయాలని చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. బుధవారం చిత్తూరు జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్యనేతలు సమావేశమై గురువారం జిల్లా స్థాయి మహానాడును నిర్వహించేందుకు నిర్ణయించారు. కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించే మహానాడును విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులంతా ఐకమత్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన చిత్తూరు నియోజకవర్గ మినీ మహానాడులో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను పార్టీ అధిష్ఠానానికి నివేదించే విషయాలపై కూడా చర్చించారు. గురువారం ఉదయం 11 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించే మహానాడు కార్యక్రమానికి పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు నాయుడు, నేతలు చంద్రప్రకాష్, మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

యువతిపై కత్తితో దాడి

● యువకుడికి దేహశుద్ధి

సోమల, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న యువతి గొంతు కోసి తీవ్రంగా గాయపరచిన యువకుడికి గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన సోమల మండలంలో బుధవారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు.. ఇరికిపెంట పంచాయతీ పార్వతీపురానికి చెందిన మాన్యం రెడ్డెప్ప నాయుడు కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లారు. రెడ్డెప్ప నాయుడి చిన్న కుమార్తె రమ్య ఇంటి వద్ద ఒంటరిగా ఉంది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు రమ్య ఇంటికి చేరుకుని మెడపై కత్తితో గాయపరిచి పరారయ్యాడు.గమనించిన గ్రామస్తులు శ్రీనివాసులును పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.దాడిలో గాయపడిన శ్రీనివాసులును పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు, రమ్యను మదనపల్లె వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివశంకర్ తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న రేషన్ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్స్ తిరుపతి జిల్లా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏఎస్వో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబాల్లో చీకట్లు నింపిన ఎండీయూ వాహనాల వ్యవస్థను రద్దు చేయడం హర్షణీయమన్నారు. రేషన్ డీలర్స్ వ్యవస్థ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రేషన్‌డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, గుత్తా కోటేశ్వరనాయుడు, హేమలత, సాల్మన్‌రాజు, శ్రీనాథ్, పుష్పాంజలి, ప్రమీలమ్మ, వెంకటేష్, జుబేద, అనీఫ్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.



కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు బుధవారం స్వాగతం పలుకుతున్న టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, పుష్పగుచ్ఛం ఇస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, బంగారుపాళ్యం మండల టీడీపీ అధ్యక్షుడు ధరణీప్రసాద్

ముగిసిన గంగమ్మ జాతరలు



కట్టకిందపల్లెలో ధనకోటి గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, మే 21 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలో గత రెండు రోజులు నిర్వహిస్తున్న గంగమ్మ జాతరలు బుధవారంతో ముగిశాయి. కట్టకింద పల్లెలో ధనకోటిగంగమ్మను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, గురజాల చెన్నకేశవులు కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. అమ్మవారిని గ్రామంలోని యువకులు, పెద్దలు భాజాభజంత్రీల మధ్య ఊరేగించి, నిమజ్జనానికి తీసుకెళ్లారు. భక్తులకు అన్నదానం చేశారు. మొగరాలపల్లె, కొత్తూరు, 197రామాపురం తదితర గ్రామాల్లో అమ్మవారిని నిమజ్జనం చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి మండల ప్రజలే కాకుండా కర్ణాటక నుంచి వేలాదిగా భక్తులు విచ్చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, టీడీపీ నాయకులు వీకే ప్రభుకుమార్, హరి, మధుసూదన్ నాయుడు, ఉదయ, రమేష్ పాల్గొన్నారు.

నడివీధి గంగమ్మను దర్శించుకున్న థామస్



వెదురుకుప్పం, మే 21(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలో బుధవారం పలు గ్రామాల్లో గంగమ్మ జాతరలు వైభవంగా జరిగాయి. కార్వేటినగరం పెద్ద హరిజనవాడ, ఆర్కేవీబీపేట హరిజనవాడ, పాదిరికుప్పం, టీకేఎంపేట హరిజనవాడ, ఆలత్తూరు తదితర ప్రాంతాల్లో గ్రామ దేవతలు గంగమ్మలకు జాతర నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, కార్వేటినగరం మండలంలో ఆర్కేవీబీపేట హరిజనవాడ, పాదిరికుప్పం, కార్వేటినగరం పెద్దహరిజనవాడల్లోని గంగమ్మ జాతర వేడుకలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్ తమ పార్టీ శ్రేణులతో కలసి గంగమ్మలను దర్శించుకున్నారు. ఆయా గ్రామాల్లో ఘనస్వాగతం పలికి సత్కరించారు.

డ్రైనేజి సమస్య పరిష్కారానికి చర్యలు

గంగాధరనెల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీనీటిని నడిరోడ్డుపై వదిలేస్తున్నారనే ఫిర్యాదుపై బుధవారం అధికారులు పరిశీలించారు. గంగాధరనెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ ఎల్లమరాజుపల్లె బస్టాప్ నుంచి గ్రామంలోకి వెళ్లే దారిలో ఓ ఇంటివారు డ్రైనేజీనీటిని వదిలేయడంతో రాకపోకలు సాగించే ప్రజలతో పాటు సమీపంలో నివసిస్తున్న వారికి ఇబ్బందులు కలుగుతున్నాయని ఎంపీడీవో సోమలరాజు సతీష్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీడీవో వెంటనే స్పందించి ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో చంద్రను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం పంచాయతీ కార్యదర్శి కుమార్, ఇన్‌చార్జి డిప్యూటీఎంపీడీవో కలిసి ఎల్లమరాజుపల్లెలో సంబంధిత ఇంటి వద్దకెళ్లి పరిశీలించారు. అనంతరం నడిరోడ్డుపై డ్రైనేజీనీటిని వదిలి ప్రజలకు ఇబ్బంది కల్గించడం సరికాదని ఆ ఇంటి యజమానికి సూచించారు. ఇంటిదగ్గర నుంచి నాలుగైదురోజుల్లో పైపులైన్ వేసుకుని డ్రైనేజీనీటిని దూరంగా వదిలే విధంగా చర్యలు కోవాలన్నారు. ఇందుకు స్పందించిన ఆ వ్యక్తి పైపులైన్‌వేసి సమస్య లేకుండా చేస్తానని అధికారులకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

కారు బోల్తా... తప్పిన ప్రమాదం



గుడిపాల, మే 21 (ఆంధ్రజ్యోతి): 197రామాపురం వెళ్లే రహదారిలో కందగిరికొండ వద్ద బుధవారం ఉదయం కారు బోల్తాపడింది. బెంగళూరు నుంచి నారగల్లు పంచాయతీ కొత్తకోటకు చెందిన వ్యక్తులు కారులో వస్తుండగా డ్రైవర్ కునుకు తీశాడు. దాంతో కందగిరికొండ వద్ద ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం పూర్తిగా ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ విషయంపై గుడిపాల పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

బాలిక అదృశ్యం

బంగారుపాళ్యం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ కోటూరుకు చెందిన ఓ 16 సంవత్సరాల బాలిక మంగళవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని బాలిక తండ్రి జ్యోతి బంగారుపాళ్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలుడిపై దాడి - కేసు నమోదు

బంగారుపాళ్యం, మే 21 (ఆంధ్రజ్యోతి): దొంగతనం చేశాడనే నెపంతో ఓ బాలుడిపై మెకానిక్ షెడ్ యజమాని దాడిచేసి గాయపరిచిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు... ఈ నెల 19వ తేదీన వడ్డూరుకు చెందిన మునిరత్నం కుమారుడు చైతన్య రాగిమానుపెంట రోడ్డు సమీపంలోని మెకానిక్ షెడ్డులో ద్విచక్ర వాహనానికి సంబంధించిన ఒక వస్తువును దొంగిలించాడని షెడ్డు యాజమాని బాలాజీ బాలుడు చైతన్యను కొట్టి గాయపరిచాడు. దీంతో గాయపడ్డ బాలుడిని చికిత్స నిమిత్తం తండ్రి మునిరత్నం చిత్తూరులోని ఓ ఆస్పత్రిలో చేర్పించాడు. మునిరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మామిడి పంట దిగుబడిపై సమీక్ష

తవణంపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): మామిడి పంట దిగుబడిపై సమగ్ర వివరాలు సేకరించాలని జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని పుణ్యసముద్రం రైతు సేవా కేంద్రంలో తవణంపల్లె, ఐరాల మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బందితో మామిడి దిగుబడిపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం సిబ్బంది వారి గ్రామ పరిధిలో పంట దిగుబడిపై వివరాలు సేకరించి, రికార్డులు సిద్ధం చేయాలన్నారు. మండలంలోని పలువు పరిశ్రమలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, ఉద్యానశాఖాధికారి సాగరిక, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

జీవో-4 నుంచి వీఆర్వోలను మినహాయించాలి

తవణంపల్లె, మే 21 (ఆంధ్రజ్యోతి): జీవో-4 నుంచి వీఆర్వోలను మినహాయించాలని, క్లస్టర్ల ఏర్పాటును పునఃసమీక్షించాలని జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే పనిభారంతో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలకు రెండు సచివాలయాలు కేటాయించడం తగదన్నారు. ప్రభుత్వం వీఆర్వోల విషయంలో తీసుకొన్న నిర్ణయంపై పునరాలోచించాలని వినతిపత్రంలో కోరారు. వీఆర్వోలు రాజశేఖర్, సురేష్, ప్రకాష్, చంద్ర, కృపానందం తదితరులు పాల్గొన్నారు.

తిరుమలరాజుపురానికి పీహెచ్‌సీ

పాలసముద్రం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలరాజుపురం గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైనట్లు డాక్టర్ మోహన్‌కృష్ణ తెలిపారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేయించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం వలన గంగమాంబాపురం, నరసింహాపురం, కోదండరామాపురం, బాలకృష్ణాపురం, ఆముదాల పంచాయతీ ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆయన చెప్పారు. నూతన ఆరోగ్య కేంద్రం మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPLE CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR.
E.P. No. 25 of 2019
O.S. No. 107 of 2008

Between
Rajendra Mandadi ....D.Hr.
And :
M.Munirathnam Mandadi (died) and others ....J.Dr's

PROCLAMATION OF SALE / AUCTION NOTICE

The schedule mentioned property in respect of **E.P No. 25 of 2019 in O.S. NO. 107 of 2008** is going to auction before the above said court on **18-06-2025** in between **10-30 A.M to 5-00 P.M.** The intending bidders may participate in the auction on the said court on the above said date and time.

SCHEDULE

Chittoor District – Chittoor Sub district- Chittoor mandal -Guvvakallu Panchayat No.36 Gollapalli revenue accounts
1.S.No. 101/10 – dry – extent Ac. 0.19 cents
2.S.No. 101/12 – dry – extent Ac. 0.54 cents
3.S.No. 101/14 – dry – extent Ac. 0.85 cents
4.S.No. 104/2A-dry - extent Ac. 0.28 cents
5.S.No. 102/1 – dry – extent Ac. 0.15 cents Within the following boundaries;
East – Lands of Sambasiva Mandadi. West – Lands of Rangaswamy Mandadi, North- Lands of Chinna swamy Mandadi,South - Lands of M.Chinna swamy Mandadi.
In this well 5 HP motor pump set – half share including the right of channels and way.
D.Hr. Value : Rs.4,00,000/- Amin's Value : Rs.3,00,000/-
Market Value : Rs.4,17,000/- EC- NIL

T.PURUSHOTHAM, Advocate for D.Hr.

PUBLIC NOTICE

Under instructions from my client **The Branch Manager, Canara Bank,Chittoor Branch-1**, I, issue the following notice to the **General Public** that One D.Manjula W/o G.Dorairaj, resident of D.No:20-494, Annaswamy Modali Street, Chittoor town & district, has purchased the house sites asmentioned in the schedule hereunder under the Regd. Sale deed No;4402/2001 dt.05-07-2001 which was registered before S.R.O. of Chittoor and after the purchase she has constructed the R.C.C. roofed housebearing D.No: 20-494 in her house 1st item site as mentioned in theschedule hereunder and after that she has approved the building plan withthe Commissioner, Chittoor Municipality under the proceedings B.P.S.Proceedings No: 162/2008/G1 dt.26-03-2008 and that the said owner **D.Manjula W/o G.Dorairaj** has approached my client bank for availing loan limits by mortgaging the schedule mentioned house properties as collateral security to my client bank under Registered simple mortgage deed infavour of my client bank by representing that the said Original Regd. Sale deed No: 4402/2001 dt.05-07-2001 standing in her name was misplaced by her in her house in Chittoor town and as such if **any body is possessing the said original Registered Sale deed No: 4402/2001 dt.05-07-2001 of S.R.O. of Chittoor which is standing in the name of D.Manjula W/o G.Dorairaj** relating to the below mentioned properties and having any claims, charges, mortgages, sale agreements, court attachments, court disputes over the properties mentioned hereunder shall be informed to the Manager of my client bank or to me in writing with in 5 days from the date of publication of this notice, otherwise later objections will not bind on my client bank in relation to the properties mentioned below.

SCHEDULE

Chittoor District – Chittoor Sub-District-Chittoor town & municipal Corporation limits-Chittoor mandal-Chittoor revenue village S.No:603-Mittoor-Annaswamy Modali street-the **1st item** house site measuring East to West: 26.3 feet and North to South: 24 feet, admeasuring: **630 sft**. and in this the R.C.C. roofed house bearing D.No: 20-494 and on the south of it, the **2nd** item house site measuring East to West: 19¾ feet and North to South on eastern side:7¾ feet and on western side: 5 feet, admeasuring: 126 sft. and both the above 1st & 2nd items situated with in the following common boundaries:
East: Lane leading from Annaswamy Modali street towards Northern side. West: House of T,.Babu Reddy in D.No: 20-493. North: House of R.Rathnavelu. South: Site sold to D.Sivasankar.

V.LOKANADHA NAIDU, Advocate, Chittoor

ప్రమాదంలో ప్రథమ చికిత్స ఎంతో అవసరం

చిత్తూరు సెంట్రల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు ప్రాథమిక చికిత్స ఎంతో అవసరమని 35వ ఆంధ్రా బెటాలియన్ తిరుపతి గ్రూప్ కమాండర్ కల్నల్ సతేంద్ర దహియా అన్నారు. ఎన్‌సీసీ క్యాంపును బుధవారం ఆయన సందర్శించి, ఎన్‌సీసీ క్యాడెట్లకు అందిస్తున్న భోజనం, వసతి ఏర్పాట్లను పరిశీలించారు. క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణతో ఎన్‌సీసీ ట్రైనింగ్ పొందడం వల్ల సమాజానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు దేశభక్తితో పాటు సేవాతత్వం అలవర్చుకోవాలని, లైఫ్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. క్యాడెట్ల భవిష్యత్తుకు ఏ,బీ,సీ సర్టిఫికెట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. డాక్టర్ మీనాక్షి క్యాంపులో క్యాడెట్లకు లైఫ్‌స్కిల్స్, ప్రథమ చికిత్స తదితర అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. క్యాంపు కమాండింగ్ అధికారి కల్నల్ మోనిష్, ఏవో లోకనాథం, మనోజ్, మహేష్‌రాయ్, ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్‌రెడ్డి, కార్తీక్, శ్రీలత, వినోద్, మస్తాన్, వెట్రియన్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో చర్చిల ప్రారంభానికి కృషి



నూతన చర్చిని ప్రారంభిస్తున్న బిషప్ శర్మా నిత్యానందం

యాదమరి, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సీఎస్ఐ చర్చిలు ప్రారంభించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు వేలూరు సీఎస్ఐ డయాసిస్ బిషప్ రెవరండ్ డాక్టర్ శర్మ నిత్యానందం అన్నారు. మండలంలోని కాశిరాల పంచాయతీ పరిధిలోని గాంధీపురంలో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ గుడ్‌షెపర్డ్ చర్చిని బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్‌కు గ్రామస్తులు, క్రైస్తవ సోదరులు, మతబోధకులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ పవిత్రమైన చర్చిలో దేవుని వాక్యాలను భక్తిశ్రద్ధలతో కీర్తించాలన్నారు. చర్చి నిర్మాణానికి కృషిచేసిన గ్రామస్తులకు, దాతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, పాస్టరేట్ సిబ్బంది, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ చిత్తూరు నగర వార్డు కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

చిత్తూరు సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలోని 50 వార్డులకు కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు సునీల్ కుమార్, మారుతీ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా ఛైర్ పర్సన్ కటారి హేమలత, ఇతర ముఖ్యనేతల పర్యవేక్షణలో మాజీ క్లస్టర్, డివిజన్ ఇన్చార్జులు, యూనిట్, బూత్ ఇన్చార్జిలతో చర్చించి నగరంలోని 50 వార్డుల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కమిటీల సభ్యులు క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని అన్నారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. నాయకులను, కార్యకర్తలను కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీల సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

ఆటోను ఢీకొన్న కారు - ముగ్గురికి తీవ్రగాయాలు

పూతలపట్టు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మిరెడ్డిపల్లి వద్ద మంగళవారం రాత్రి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను కారు ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తలుపులపల్లి నుంచి ప్రయాణికులతో చిత్తూరు వైపు వస్తున్న ఓ ఆటోను చిత్తూరు నుంచి పీలేరు వైపు వెళ్తున్న కారు ఎదురుగా ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సుజాత, జగదాంబ, తేజశ్రీలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జగదాంబ పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింహ, ముత్యపు పందిరి వాహనాలపై వేణుగోపాలుడి విహారం



సింహ వాహనం, ముత్యపు పందిరిపై వేణుగోపాలుడి చిద్విలాసం

వెదురుకుప్పం, మే 21 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సింహ వాహనంపై, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై వేణుగోపాలస్వామి విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, నిత్యకైంకర్యాలు, పూజలు నిర్వహించారు. తర్వాత రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి సింహ వాహనంపై అధిష్ఠించి పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. 10 గంటల నుంచి 11 గంటల మధ్య ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య ఊంజల్ సేవను మండపంలో నిర్వహించారు.

ముత్యపు పందిరిపై వేణుగోపాలుడు

బుధవారం రాత్రి స్వామి అమ్మవార్లు ముత్యపు పందిరి వాహనంపై కోలాటాలు, చెక్కల భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగారు. ఇంటింటా కర్పూర హారతులిచ్చి భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. రాత్రి 9.45 గంటలకు శుద్ధి, ఏకాంత సేవతో పవళింపజేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబు సురేష్, ఏఈవో రవి, సూపరింటెండెంట్ సోమశేఖర్, కంకణభట్టర్ తరుణ్‌కుమార్, వేదపండితులు నారాయణదాశరథి, గోపాలాచార్యులు, రమేష్, శబరీష్, మోహనభట్టాచార్యులు, భక్తులు, టీటీడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

జీడీ నెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● ప్రభుత్వ విప్ థామస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ థామస్

శ్రీరంగరాజపురం, మే 21(ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ అన్నారు. పుల్లూరు క్రాస్ రోడ్డులోని ఎస్ఎల్‌వీ కల్యాణ మండపంలో బుధవారం టీడీపీ మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎస్ఆర్‌పురాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్ది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా మారుస్తానని తెలిపారు. టీడీపీ నిరుపేదల పాలిట పెన్నిధిగా ఆవిర్భవించిందని, ప్రజల సంక్షేమమే విధిగా కృషి చేస్తోందని అన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి ప్రత్యేక గుర్తింపు ఇస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి మినీ మహానాడులో 25 అంశాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, పాలసముద్రం మాజీ జడ్పీటీసీ చిట్టిబాబు నాయుడు, రుద్రయ్య నాయుడు, జనార్దన రాజు, గురుసాల కిషన్‌చంద్, అరుణమ్మ, ఇంద్రమ్మ, మునివర్ధ నాయుడు, వేమ నాయుడు, పైనేని మురళి, గుండయ్య, ఎన్.కుమార్, వెంకటాచాలం, నిరంజన్‌రెడ్డి, బల్లా వెంకటేష్, పుల్లూరు బాబు, టీడీపీ ఆరు మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుతీరుపై నివేదికకు కలెక్టర్ ఆదేశం



ఎంవీఐ నరసింహులుకు వినపత్రమిస్తున్న ప్రజలు

గుడిపాల, మే 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు-చెన్నై జాతీయ రహదారైన చీలాపల్లె నుంచి నరహరిపేట క్రాస్ వరకు సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని బుధవారం ఎంవీఐ లు నరసింహులు, మురళికి మండల ప్రజలు వినతిపత్రం అందించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన 'గుడిపాలలో తరచూ ప్రమాదాలు' అన్నవార్తకు కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించి ఆ రోడ్డును పరిశీలించి నివేదికలు సమర్పించాలని రవాణా శాఖ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన సూచనల మేరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు నరహరిపేట నుంచి వసంతాపురం, గుడిపాల, కీలారపల్లె, కొత్తపల్లె, ముట్టుకూరుపల్లె, చీలాపల్లె క్రాస్ వరకు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వీసు రోడ్డు లేక రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది ఆస్పత్రి పాలయ్యారని మండల ప్రజలు వారికి తెలిపారు. ఫోర్ లైన్ల రోడ్డు వేసిన అనంతరం మూడు సంవత్సరాల వ్యవధిలో ఇక్కడ 18 మంది మృత్యువాత పడగా, 70 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. వెంటనే సర్వీసు రోడ్డును నిర్మించాలని వారిని కోరారు.

గంగమ్మా... కరుణించవమ్మా...!

● ఘనంగా వజ్రాలపురం గంగమ్మ ఊరేగింపు



వజ్రాలపురం గంగమ్మను దర్శించుకున్న ఉభయదారులు

బంగారుపాళ్యం, మే 21 (ఆంధ్రజ్యోతి): బొమ్మాయిపల్లె పంచాయతీ వజ్రాలపురం బోయకొండ గంగమ్మ జాతరలో భాగంగా మూడవ రోజైన బుధవారం ఉదయం అమ్మవారి మూలవిరాట్‌ను అర్చకులు అలంకరించి, అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాధమ్మ, క్రిష్ణప్ప, డాక్టర్ ఉషా కొమ్మినేని, చాతుర్య, పురుషోత్తం, దీప, గోపి, మమతలు ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని సుందరంగా అలంకరించి ముత్యాల పల్లకిపై అధిష్ఠింపజేసి ఊరేగించారు. ఈ యాత్ర బొమ్మాయిపల్లె మీదుగా కురప్పల్లి, తిమ్మోజుపల్లె, మాధవనగర్, బంగారుపాళ్యం, తగ్గువారిపల్లె, కరుడువారిపల్లె గ్రామాల మీదుగా సాగింది. జీఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత ఈశ్వర్‌నాయుడు దంపతులు, ఆలయ కమిటీ మెంబర్లు నాగరాజగౌడ్, శివలింగయ్య, అట్లూరి వేణుగోపాల్, రామ్మూర్తినాయుడు, రాజేంద్ర నాయుడు, సుబ్బా నాయుడు, మురళీ, శంకరయ్య, తులసీ, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి నిమజ్జనం



భక్తులకు హారతి ఇస్తున్న జగదీశ్వర్ రెడ్డి

పూతలపట్టు, మే 21 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నడివీధి గంగమ్మ నిమజ్జన కార్యక్రమం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం వంశపారంపర్య ధర్మకర్త జగదీశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యుల తొలిపూజతో ప్రారంభమైన గంగమ్మ జాతర బుధవారం రాత్రి అమ్మవారి నిమజ్జనంతో ముగిసింది. చిత్తూరు-కడప జాతీయ రహదారి నుంచి మంగళవాయిద్యాలు, బాణసంచా కాలుస్తూ గజమాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు రాత్రి 7.00 గంటల వరకు యువకులు, గ్రామస్థుల కేరింతల మధ్య నీవానది వద్దకు తీసుకెళ్లి అమ్మవారిని నిమజ్జనం చేశారు. జగదీశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, సుబ్బారెడ్డి యూత్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా కాశిరాల గంగజాతర



గంగమ్మ విశ్వరూప దర్శనం

యాదమరి, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాశిరాల గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు విశ్వరూప దర్శనం కల్పించారు. రాత్రి గజమాలతో బాణసంచా వేడుకలు, భక్తుల ప్రత్యేక పూజల నడుమ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున ప్రత్యేక అలంకరణలో భారీ గజమాలలు ఊరేగించి గంగమ్మకు సమర్పించారు. మహిళలు అమ్మవారికి పిండి దీపాలతో నైవేద్యం సమర్పించి, ముత్యాలమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా స్థానిక ధనకొండ గంగమ్మకు స్థానికులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక వేషధారణలో ఇళ్లలో పూజలు చేసి నిమ్మకాయలు దారాలతో ఒంటి నిండా కుర్చి పూజలు చేసి మాలలు సమర్పించడం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాత్రి గంగమ్మ నిమజ్జన కార్యక్రమం ఆలయ కమిటీ, గ్రామస్థులు పూర్తిచేశారు.

అన్న క్యాంటీన్‌కు స్థల పరిశీలన

పూతలపట్టు, మే 21 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల కేంద్రంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు కోసం తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో నాగరాజు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. పోలీసుస్టేషన్ సమీపాన నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు, ఎంపీడీవో కార్యాలయ ఆవరణం, చిత్తూరు - కడప జాతీయ రహదారి పక్కన ఉన్న సబ్ సెంటర్ ఆవరణం తదితర ప్రాంతాలను పరిశీలించారు.

డీలర్ల సంఘ అధ్యక్షురాలిగా మాధవి

ఐరాల, మే 21 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండల చౌక దుకాణాల డీలర్ల సంఘ అధ్యక్షురాలిగా మాధవి బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఎన్నికలో ఆమెను డీలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమె మాట్లాడుతూ మండలంలో చౌక దుకాణాల డీలర్ల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన వారందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కమిషనర్‌కు ఎమ్మెల్యే పరామర్శ



చిత్తూరు అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం గాదంకి టోల్‌ప్లాజా వద్ద గత శనివారం కారు టైరు పగలడంతో డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న చిత్తూరు నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ గాయపడ్డారు. ఆయన్ను బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరామర్శించారు. తిరుపతిలో ఉంటున్న కమిషనర్ నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తగిన విశ్రాంతి తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నేత వసంత్ కుమార్ ఉన్నారు.

కాపుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దాం



ప్రసంగిస్తున్న ఎం.వి.బాబు

నగరి, మే 21 (ఆంధ్రజ్యోతి): కాపు కుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దామని కాపు సంఘం నేతలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎస్.వి.జి కల్యాణ మండపంలో నగరి నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షులు ఎం.వి.బాబు అధ్యక్షతన కాపు సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆ సంఘ కార్యదర్శి గోపిరాయల్ మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా కాపుల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ కే.జే.కుమార్ మాట్లాడుతూ అందరూ కలిసి మెలిసి కాపు సంఘ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కాపు సంఘం అధ్యక్షుడు ఎం.వి.బాబు, డాక్టర్ రామచంద్రన్‌లు మాట్లాడుతూ నిరుపేద కాపు విద్యార్థులకు అవసరమైన అభ్యసన సామగ్రిని సంఘం ద్వారా అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏ.ఎం.రాధాకృష్ణ, గుణశేఖర్, జ్యోతి నాయుడు, విజయబాబు, రవిబాబు, ఉమాపతి, గోవిందయ్య, శ్రీధర్, అయ్యప్ప అశోక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

నగరి, మే 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ మాజీ అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి తమిళనాడులోని రాజీవ్‌గాంధీ సమాధివద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ కార్యదర్శి బాబు, పీసీసీ మెంబరు నటరాజ మొదలియార్, నాయకులు భానుమూర్తి, దేశయ్య, అల్లాపిచ్చి, దేశప్పన్, చిరంజీవిరెడ్డి, సుధాకర్‌రాజు, కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిండుకుండలా గౌనివానిచెరువు

బంగారుపాళ్యం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలి సమీపంలో ఉన్న గౌనివానిచెరువు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి నిండుకుండలా నిండి మొరవపారుతోంది. బుధవారం ఇరిగేషన్ శాఖ డీఈ మల్లేష్‌నాయక్, ఏఈ విజయ్‌కుమార్‌లు గౌనిచెరువు మొరవ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ నీరు దిగువ నున్న కామాక్షమ్మ చెరువుకు చేరుతుంది. టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్, నాయకులు, ఆయకట్టుదారుడు ధనంజయ నాయుడు, గ్రామస్తులు చెరువు వద్ద పూజలు చేశారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం: థామస్

వెదురుకుప్పం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కార్వేటినగరం మండలం కొటార్వేడుకు చెందిన గిరిబాబు(29) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్ బుధవారం ఆ గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని, రూ.20వేలు ఆర్థికసాయం అందించారు.

వరసిద్ధుడి సేవలో టీటీడీ బోర్డు సభ్యుడు

ఐరాల(కాణిపాకం), మే 21 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు నన్నపనేని సాంబశివరావు కుటుంబ సమేతంగా బుధవారం స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

అంధకారం నుంచి విముక్తి కల్పించండి

వెదురుకుప్పం, మే 21 (ఆంధ్రజ్యోతి): అంధకారం నుంచి తమకు విముక్తి కల్పించాలని బుధవారం కార్వేటినగరం ఏడీఈ చంద్రబాబుకు కోదండరామాపురం గ్రామస్తులు వినతిపత్రమిచ్చారు. కార్వేటినగరం మండలం కోదండరామాపురంలో 15 రోజులుగా రాత్రుల్లో కరెంటు లేకుండా చీకట్లో గడుపుతున్నామని, తమ సమస్యను పరిష్కరించాలని బుధవారం కార్వేటినగరం ఏడీఈ కార్యాలయానికి చేరుకుని సమస్యపై వినతిపత్రమిచ్చారు. సమస్య పరిరిస్తానని ఏడీఈ హామీ ఇచ్చారని వారు తెలిపారు.